## క్లుప్తంగా

### శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేష్ కూతురు శిరిష,నవీన్ వివాహానికి రాయదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. ఆదివారం అడిగుప్ప గ్రామంలో జరిగిన పాలయ్య కూతురు సరోజ,సునీల్ వివాహానికి హాజరయ్యారు. కార్యక్రమంలో కె.పి.దొడ్డి సర్పంచ్ రమేష్,నాయకులు తాళ్లకెర వీరభద్రరెడ్డి, ఈశ్వరరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, తిప్పేస్వామి, బెస్త రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాలువపల్లిలో..



గంగవరంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశులు కుమారుడు మోహిత్ కేశఖండన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరయ్యారు. గంగవరం శివాలయం వద్దనున్న కళ్యాణమంటపంలో దుద్దేకుంట వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీ మేనల్లుడు వరుడు తిప్పేస్వామి, వధువు రేణుక వివాహం జరిగింది. వేడుకకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, ఏడీసీసీబీ డైరెక్టర్ శివలింగప్ప పాల్గొన్నారు.

### దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

రాయదుర్గంటౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయదుర్గం సిటిజన్స్ తెలిపారు. ఆదివారం సాయంత్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీఎన్జీవో భవనంలో అన్ని రంగాల్లోని మహిళలను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, బీజేపీ నాయకురాలు వసుంధర, కౌన్సిలర్ శారదాదేవి, ఏఎన్‌ఎం సరోజను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అంబోజీరావు, పొరాళ్ల ధనార్జున తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీ రిజర్వేషన్ కోసం వాల్మీకులు ఏకతాటిపై రావాలి



సమావేశమైన వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ సాధన కమిటీ నాయకులు

రాయదుర్గంటౌన్: ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం వాల్మీకులు ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉందని ఎస్టీ రిజర్వేషన్ సాధన ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కోటలోని వాల్మీకి కల్యాణమంటపంలో రిజర్వేషన్ సాధన సమితి తొలి సమావేశం నిర్వహించారు. వాల్మీకుల్లో ఐక్యత లేకపోవడంతోనే రిజర్వేషన్ సాధించుకోలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కావాలి రవి, ఈశ్వర్, మల్లికార్జున, పవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### 12 నుంచి భంభంస్వాముల ఉరుసు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శ్రీమహాయోగి భంషేక్ అబ్దుల్ వాహబ్ స్వాముల ఉరుసు ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు బషీర్ అహ్మద్, అబ్దుల్ వాహబ్ తెలిపారు. 12న స్వామి సందల్ ముబరాక్ (గంధం), 13న శ్రీస్వాముల చిత్రపటం ఊరేగింపు, సాయంత్రం దర్గాలో చిరాఖేన్ (దీపారాధన), 14న షంషీర్ (బ్రహ్మోత్సవం), జియారత్, పౌర్ణమి, గురుపూజ పీఠాధిపతులచే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందన్నారు.

# పటిష్టం..మోటారు వాహన చట్టం

- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, లైసెన్సు రద్దు
- హైకోర్టు ఆదేశాలతో ప్రత్యేక నిబంధనలు
- వాహనదారులు సహకరించాలంటున్న పోలీసులు

బొమ్మనహాళ్: రోడ్డెక్కితే ఇక బాదుడే. రహదారిపై నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా చెల్లించాల్సిందే. రెండోసారి పట్టుబడితే ఆ జరిమానాలు సుమారు పదింతలవుతుంది. దీంతో సగటు వాహనదారుడు ప్రయాణించేటప్పుడు ఏ మాత్రం జాగ్రత్త తీసుకోకపోయినా జేబులు గుల్లవ్వడం ఖాయం. ఈ నెల 1 నుంచి నూతన మోటారు వాహన చట్టం అమలోకి వచ్చింది. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ స్థాయి బాదుడు తప్పదు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, లైసెన్సులు రద్దు అవుతాయి.

**కో ప్యాసింజర్ సీటు బెల్టు వాడాలి..**

ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనుక కూర్చున్న వారు హెల్మెట్‌ను విధిగా ధరించాల్సిందే. ఇతర వాహనాలు నడిపే వారితో పాటు కో ప్యాసింజర్ సైతం సీటు బెల్టు ధరించాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, రవాణాశాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారమిచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేయనున్నారు. ఇప్పటికే గత నెల రోజుల నుంచి రవాణాశాఖ అధికారులు రహదారి ఉల్లంఘనలు, జరిమానా చెల్లింపులపై విస్తృత ప్రచారం నిర్వహించింది. హెల్మెట్ ధరించకుంటే సంభవించే ప్రమాదాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ప్రస్తుతం రవాణా శాఖ అధికారులు నగరాల్లో అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక నుంచి పట్టణాలు, పల్లె ప్రాంతాల్లో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.



డ్రంకన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నబీరసూల్

### ఉల్లంఘన, కొత్త జరిమానాలు

- లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇస్తే రూ. 5,000
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5,000
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.1,000
- ట్రిపుల్ డ్రైవింగ్ రూ.1,000
- మైనరు వాహనం నడిపితే రూ.10,000
- అతి వేగం చిన్న వాహనాలకు రూ.1000
- పెద్ద వాహనాలకు రూ.2000
- ప్రమాదకరంగా వాహనాన్ని నడిపితే రూ.2000 (మొదటిసారి), రూ.10,000 ( రెండోసారి)
- రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడిపితే రూ.5,000 (మొదటి సారి), రూ.8,000 (రెండోసారి)
- వాహనాలతో రేసింగ్ చేస్తే రూ.5,000 (మొదటిసారి), రూ.10,000( రెండోసారి)
- సీటు బెల్టు ధరించకపోతే రూ.1000
- హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1000 (మొదటి సారి),రూ.2,000 (రెండోసారి)
- ఇన్సురెన్సు లేని వాహనాలకు రూ.2000 (మొదటిసారి), రూ.4,000 ( రెండోసారి)
- మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10,000, జైలు శిక్ష (న్యాయమూర్తి ఆదేశాల మేరకు)

### నిబంధనలు పాటించాలి



వాహనదారులు పోలీసులకు సహకరించి, నూతన వాహన చట్టాలను పాటించాలి. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి వాహనదారుడు రోడ్డుపైకి వచ్చేటప్పుడు డాక్యుమెంట్లు, హెల్మెట్ ధరించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులు జరిమానాలు వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. రెండోసారి పట్టుబడితే జరిమానా మరింత కఠినంగా ఉంటుంది.

– నబీరసూల్, ఎస్‌ఐ బొమ్మనహాళ్

### మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత

రహదారులపై మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా వాహనాలు నడిపితే సంభవించే ప్రమాదాలపై రవాణాశాఖ ప్రచారాన్ని విస్తృతం చేసింది. ప్రతి హైస్కూల్, కళాశాలల్లో విద్యార్థులకు రవాణాశాఖ నిబంధనలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### 12న యువత పోరు



పోస్టర్లను విడుదల చేస్తున్న రంగయ్య, పార్టీ నేతలు

కళ్యాణదుర్గం: ఈనెల 12న అనంతపురంలో జరగనున్న వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'ను విజయవంతం చేయాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కంబదూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తిప్పేస్వామి, ఎల్‌ఎం మోహన్‌రెడ్డితో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. రంగయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు విద్యార్థులకు, నిరుద్యోగులకు అండగా ఉంటామని, మేనిఫెస్టోలో అమలు కాని హామీలను ఇచ్చిన చంద్రబాబు..అధికారంలోకొచ్చిన తర్వాత నిలువునా ముంచుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసనకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

### ఉపాధ్యాయినికి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని రజనీకుమారి

ఉరవకొండ: అనంతపురం తపోవనంలోని మార్కండేయస్వామి ఆలయ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి మహి ళా చైతన్య సదస్సు ఆదివారం జరిగింది. గడేహోతూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయిని రజనీకుమారిని సన్మానించారు.

# అబద్ధపు హామీలతో నిలువునా మోసం





మాట్లాడుతున్న కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, భారీ సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు
- ప్రశ్నించడానికి పార్టీ పెట్టిన పవన్ ఎక్కడ?
- వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం (కంబదూరు): అబద్ధపు హామీలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజలను నిలువునా ముంచిందని, పింఛన్ రూ.వెయ్యి పెంచామని సూపర్ సిక్స్ పథకాలకు చంద్రబాబు పంగనామాలు పెట్టారని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య విమర్శించారు. ఆదివారం కంబదూరులోని ఐ ఓబయ్య వ్యవసాయ క్షేత్రంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ అంటూ అన్నివర్గాలనూ మోసం చేశారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాఠశాలకు వెళ్లే విద్యార్థి తల్లి ఖాతాకు జమ చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారని తెలిపారు. దీన్ని బట్టి కేవలంలో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే పథకం వర్తిస్తుందనేది ప్రజలు గమనించాలన్నారు. అన్నదాత సుఖీభవ అంటూ రైతులను మోసం చేశారని విమర్శించారు. తాను ప్రశ్నించడానికే పార్టీని పెట్టినట్లు గొప్పలు చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. హామీల అమలులో ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. తాను శ్రీమంతుడిని కళ్యాణదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన అమిలినేని సురేంద్రబాబు.. బీటీపీ కాలువ పనులు తవ్వకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇటీవల బడ్జెట్‌లో నీటి పారుదలకు అతి తక్కువ కేటాయింపులు చేశారని, అది ఏ ప్రాజెక్టుకు కేటాయిస్తారో తెలియని పరిస్థితి అన్నారు.

**రైతుల శ్రేయస్సు కోసం పాదయాత్ర..**

కళ్యాణదుర్గం ప్రాంత రైతుల శ్రేయస్సు కోసం బీటీపీ నుంచి పాదయాత్ర చేస్తానని రంగయ్య మరోసారి స్పష్టం చేశారు. తనతో పాటు ప్రతి చెరువులో రైతులు, పార్టీ శ్రేణులు కలిసి నిద్రించాలని పిలుపునిచ్చారు. ఏ కష్టం వచ్చినా అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శులు తిప్పేస్వామి, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జరిగిన పొరపాట్లను సమీక్షించుకొని ప్రతి ఒక్కరూ మరింత కష్టపడి మరోసారి కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేంద్రరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు, ఆనంద్ చౌదరి, హనుమంతరెడ్డి, జిల్లా డాక్టర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ బొమ్మయ్య, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి యర్రంపల్లి కృష్ణమూర్తి, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జెడ్పీటీసీలు గుద్దెళ్ల నాగరాజు, బొమ్మన్న, రాధాస్వామి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, ఎంపీపీలు భీమేష్, ఆంజనేయులు, కమలా నాగరాజు, మండల కన్వీనర్లు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, గోళ్ల సూరి, ఎంఎస్ హనుమంతరాయుడు, వడ్డే వెంకటప్ప, కె.హనుమంతరాయుడు, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్, నాయకురాలు చందనా శివాజీ, ప్రియాంక, వివిధ విభాగాల అధ్యక్షులు నీలిశంకరప్ప, రామాంజనేయులు, పాతలింగప్ప, షేక్షావలి, కిరణ్, దాదు, శీనా, చరణ్, వీరన్న, నాగలక్ష్మి, డాక్టర్ సంధ్య, సునీత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీకాంత్ (23) ఆదివారం మృతి చెందాడు. బళ్లారికి చెందిన శ్రీకాంత్ ఈనెల 6న కళ్యాణదుర్గంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శ్రీకాంత్‌తోపాటు సంతోష్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పట్టణంలోని డంపింగ్ యార్డు సమీపంలో అదుపుతప్పికిందపడ్డారు. గాయపడ్డ శ్రీకాంత్, సంతోష్‌లను వెంటనే స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. సంతోష్‌కు కాలు విరిగింది. శ్రీకాంత్ బళ్లారిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అటవీ ప్రాంతానికి నిప్పు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 30వ వార్డు సిద్దేశ్వర కాలనీకి ఆనుకున్న ఉన్న కొండపై గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం నిప్పు పెట్టారు. దీంతో సీతాఫలం చెట్లు, ఎండుగడ్డికి మంటలు వ్యాపించాయి. రాత్రి 8 గంటలవుతున్నా మంటలు రగులుతూనే ఉన్నాయి.

# పులకించిన గవిమఠం



పీఠాధిపతుల ఆశీస్సులు పొందుతున్న ఉత్తరాధికారి, మఠాల పీఠాధిపతులు తదితరులు



పట్టు వస్త్రాలు అందిస్తున్న నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ఉరవకొండ: చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవంలో భాగంగా గవిమఠం పులకించిపోయింది. స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహా రథోత్సవం అనంతరం గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి ఆధ్వర్యంలో భక్తి ప్రవచనలు, ధార్మిక, ఆధ్యాత్మిక ప్రబోధన కార్యక్రమాలు నిర్వహించారు. భారీ పూలమాలలను సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఊరేగింపుగా వచ్చి సహాయకమిషనర్ రాణికి అందించారు.

**పట్టువస్త్రాల బహూకరణ..**

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామికి ఈ ఏడాది పట్టువస్త్రాలను ఆలయ అర్చకులు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకొచ్చి గవిమఠం కమిషనర్ రాణికి అందించారు.

**భారీ పోలీసుల బందోబస్తు ..**

గవిమఠం మహారథోత్సవానికి గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో 200 మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఏడుగురు సీఐలు, 11 మంది ఎస్‌ఐలు బందోబస్తులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదోని చౌకి మఠం పీఠాధిపతులు కళ్యాణ స్వామిజీ, మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, వీరశైవ సంక్షేమ సంఘం సభ్యులు, మఠం సిబ్బంది నారాయణస్వామి, గోపిలు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు బహూకరిస్తున్న కొత్తశరత్ దంపతులు

**గాయత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు**

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మఠం ఆవరణలో కొలువుదీరిన గాయంత్రి అమ్మవారికి ఉరగాద్రి ఆలయ ట్రస్టీ చైర్మన్ కొత్తశరత్, ఆయన సతీమణి వైద్యాధికారిణి డాక్టర్ కొత్త సాక్షి దంపతులు పట్టువస్త్రాలు, వడి బియ్యం సమర్పించారు. ఆదోని చౌకిమఠం పీఠాధిపతులు కల్యాణస్వామిజీ, బీజాపూర్ పీఠాధిపతులు గురులింగస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ కె.రాణి, ఏజెంట్ రాజన్నగౌడ్, ఆలయ అర్చకులు విరుపాక్షి ఆధ్వర్యంలో అందించారు. అనంతరం పీఠాధిపతుల ఆధ్వర్యంలో కొత్తశరత్ దంపతులను సన్మానించారు.



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు



మహారథోత్సవం వద్ద త్రెడ్లు వేయడానికి వెళ్తున్న వడ్డెర సేవా సంఘం సభ్యులు



రథానికి వేయడానికి పూలమాలను ఊరేగింపుగా తెస్తున్న దృశ్యం

## 11న రైతాంగ సదస్సు జయప్రదం చేయండి



రైతాంగ సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం, వైఎస్సార్ సీపీ నేతలు

కూడేరు: హంద్రీ నీవా కాలువకు కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వేడుకుంటున్నా ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానించడం దారుణని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, పండ్లతోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. హంద్రీ నీవా పరిరక్షణ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న కూడేరులోని శివరావు కళ్యాణమండపంలో రైతాంగ సదస్సు నిర్వహించనున్నారు. ఆదివారం హంద్రీ నీవా పరిరక్షణ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతాంగ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. రైతాంగ సదస్సుకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, వివిధ రైతు సంఘాల జిల్లా నేతలు హాజరవుతారన్నారు. 11న కూడేరులో నిర్వహించే రైతాంగ సదస్సుకు పార్టీలకు అతీతంగా రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ దేవ, యూత్ మండల కన్వీనర్ కేశన్న, వలంటీర్స్ మండల కన్వీనర్ విజయభాస్కర్ రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు ఈశ్వరయ్య, కిష్టప్ప, చంద్రశేఖర్, వేణు, సీపీఐ నేతలు వెంకటేష్, రమణ, సీపీఎం నేతలు వీరప్ప, ఏఐకేఎంఎస్ నేత సంజప్ప పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ఆర్థిక భరోసా కరువు



మాట్లాడుతున్న పండ్లతోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

కూడేరు: కూటమి ప్రభుత్వంలో రైతులకు ఆర్థిక భరోసా కరువైందని పండ్లతోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, వెంకటేశులు మండి పడ్డారు. రైతు సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం కూడేరుకు చేరుకుంది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామంద్రారెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజక వర్గంలో రైతులు వేలాది ఎకరాల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారన్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి బ్యాడిగి మిర్చి సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక నష్టపోయారన్నారు. పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.10 వేలుతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్ట పోయిన రైతులకు ఇన్సూరెన్స్, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మధుసూదన్, విరుపాక్షి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, రైతు సంఘం మండల నేతలు వీరప్ప, కరీం, మల్లికార్జున, నారాయణ రెడ్డి రాధాకృష్ణ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బెళుగుప్ప: నక్కలపల్లి – బెళుగుప్ప గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసర్ రాంప్రసాద్ ద్విచక్రవాహనంపై కణేకల్లు క్రాస్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో గుండ్లపల్లి నుంచి ద్విచక్రవాహనంపై రాజశేఖర్ వెళ్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



తలకు తీవ్ర గాయాలైన రాంప్రసాద్

# సంబరం.. అపూర్వ సమ్మేళనం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం ఒక చోట సమ్మేళనమయ్యారు. 1992–95 బ్యాచ్ విద్యార్థులు ఉత్సాహంగా ఒక చోట చేరి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. నాటి అధ్యాపకులైన ప్రస్తుత ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు సురేష్, తెలుగు పండిట్ నాగరాజరావు, అధ్యాపకులు శేషయ్య, రాధాకృష్ణ, చక్రవర్తి, చంద్రమౌళిని సన్మానించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు దాండియా, కోలాటం ఆడి సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివానంద, చల్లా కిషోర్, పాతిరెడ్డి, బషీర్, బోసెఫ్, కిశోర్, రవి, ప్రసాద్, బంగి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పులకుంటలో 2000–2001 విద్యా సంవత్సరం ఏడో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జిలాన్ బాషా, అనిల్‌ను సన్మానించారు. అప్పటి విద్యార్థి గొల్ల తిప్పేస్వామి అనారోగ్యంతో బాధపడుతుండడంతో పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిత్తయ్య, శివారెడ్డి, ధనుంజయ, రాకేశ్, గణేష్, పెన్నప్ప, జయసుధ, రాజేశ్వరి, రాధమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయుడు